సాక్షి తిరుపతి

శుక్రవారం । 22 । సెప్టెంబర్ । 2023



విహారానికి వేళాయె!

తిరుమలలో శుక్రవారం గరుడసేవను పురస్కరించుకుని టీటీడీ విస్తృత ఏరార్పట్లు చేపట్టింది. - 8లో



మూడంచెల భద్రత

తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలకు మూడంచెల భద్రత కల్పించినట్లు టీటీడీ ఈఓ ఏవీ ధర్మారెడ్డి తెలిపారు. - 8లో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	33	25
చిత్తూరు	33	24
తిరుమల	28	21
గూడూరు	35	27
నగరి	34	25

న్యూస్‌రీల్

వైఎస్సార్‌సీపీ న్యాయవిభాగంలో నియామకాలు



రామిరెడ్డి రోజారెడ్డి



ముని బాలసుబ్రహ్మణ్యం

చిత్తూరు కలెక్టరేట్ : వైఎస్సార్‌సీపీ తిరుపతి, చిత్తూరు జిల్లాల న్యాయవిభాగం(లీగల్‌సెల్)లో పలువురిని నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఉత్తర్వులు జారీచేసింది. ఆ ఉత్తర్వుల మేరకు తిరుపతి జిల్లా న్యాయ విభాగం జోనల్ ఇన్‌చార్జిగా రామిరెడ్డి రోజారెడ్డి, న్యాయ విభాగం జిల్లా అధ్యక్షుడిగా ముని బాల సుబ్రహ్మణ్యం (దొరబాబు) నియమితులయ్యారు.

చేప పిల్లలు సిద్ధం



చేప తొట్టెలను పరిశీలిస్తున్న శ్రీనివాస్ నాయక్

తిరుపతి అర్బన్ : చెరువుల్లోకి నీరు రాగానే వదిలేందుకు చేప పిల్లలను సిద్ధం చేసినట్లు జిల్లా మత్స్యశాఖ అధికారి శ్రీనివాస్ నాయక్ తెలిపారు. గురువారం ఆయన జిల్లా మత్స్యశాఖ కార్యాలయం సమీపంలోని తొట్టెల్లో పెంచుతున్న చేప పిల్లలను పరిశీలించారు. మత్స్యశాఖాధికారి మాట్లాడుతూ తిరుపతితోపాటు కల్యాణీడ్యామ్, పిచ్చాటూరు డ్యామ్ వద్ద సుమారు నెల నుంచి జాలర్ల సమక్షంలో చేప పిల్లలను పెంచుతున్నట్లు వెల్లడించారు. చెరువులు నిండిన వెంటనే చేప పిల్లలను వదిలేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు వివరించారు.

నేడు రెజ్లింగ్ జిల్లా జట్ల ఎంపిక

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతిలోని శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆవరణలో శుక్రవారం ఉదయం 10 గంటలకు రెజ్లింగ్(గ్రాప్లింగ్) జూనియర్, సీనియర్ జిల్లా జట్ల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర గ్రాప్లింగ్ అసోసియేషన్ కార్యదర్శి సాయిసుమతి తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ సీనియర్ విభాగానికి 1989- 2003, జూనియర్ విభాగానికి 2004-05 మధ్యలో జన్మించిన వారు అర్హులని తెలిపారు. క్రీడాకారులు తమ ఒరిజినల్ ఆధార్ కార్డు, నాలుగు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో హాజరుకావాలన్నారు. ఎంపికైన వారు ఈ నెల 23, 24వ తేదీల్లో విశాఖపట్నంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు. వివరాలకు 77801 24037 నంబరులో సంప్రదించాలని సూచించారు.

నేడు జిల్లా స్థాయి సైన్స్ సెమినార్

తిరుపతి ఎడ్యుకేషన్ : చిరుధాన్యాల ఆవశ్యకతపై తిరుపతి ఎస్వీయూ క్యాంపస్ స్కూల్లో శుక్రవారం జిల్లా స్థాయి సైన్స్ సెమినార్ నిర్వహించనున్నారు. గురువారం ఈ మేరకు జిల్లా సైన్స్ అధికారి భానుప్రసాద్ మాట్లాడుతూ చిరుధాన్యాల ఆవశ్యకతపై విద్యార్థులకు అవగాహన కల్పించడంతో పాటు పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. విజేతలకు బహుమతులతోపాటు ఈ నెల 25న విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి సెమినార్‌లో పాల్గొనే అవకాశం కల్పించనున్నట్లు వివరించారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 4 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 64,277 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 24,340 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ. 2.89 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.

నెమలి పింఛ వినాయకుని సన్నిధిలో పోలీసులు



వినాయకుడి సేవలో పోలీస్ అధికారులు

తిరుపతి రూరల్: తుమ్మలగుంటలో కొలువదీరిన నెమలి పింఛ వినాయకస్వామిని వందలాది మంది భక్తులు దర్శించుకుంటూనే ఉన్నారు. ఈ క్రమంలో గురువారం రాత్రి చంద్రగిరి డీఎస్పీ యశ్వంత్, సీఐలు శివప్రసాద్ రెడ్డి, సురేంద్రనాథ్‌రెడ్డి, ఓబులేసు, అబ్బన్న, రెడ్డెప్పలతో పాటు పలువురు పోలీసులు వినాయకుడిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు.



సర్వభూపాల వాహనంపై శ్రీవారు



విద్యుద్దీప కాంతులీనుతున్న శ్రీవారి ఆలయం



కల్పవృక్ష వాహనంపై దేవదేవుడు

స్మరామీ.. సర్వాంతర్యామి





అఖిలాండ కోటి బ్రహ్మాండనాయకుని దర్శనంతో భక్తజనులు పులకించారు.. కల్పవృక్షవాహనంపై కొలువుదీరిన కోనేటి రాయుని వీక్షించి పరవశించారు.. ఆపదమొక్కులవాడా అనాథరక్షకా పాహిమాం అంటూ వేడుకున్నారు.. కలియుగ వైకుంఠంలో దివ్యతేజోవిరాజితుడైన వేంకటనాథుని వైభవాన్ని వేనోళ్ల కొనియాడారు.. సర్వభూపాల వాహనంపై రాజసంగా అధిష్ఠించిన శేషశయనవాసుని సేవించుకుని తరించారు. తిరుగిరులు మార్మోగేలా గోవిందనామాన్ని స్మరిస్తూ పులకరించారు.. మాడ వీధుల్లో విహరిస్తున్న దేవదేవునికి కర్పూరహారతులు సమర్పించి పునీతులయ్యారు.

సర్కారు హారతి మాత్రమే

శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి నిర్వహించనున్న గరుడ సేవలో సర్కారు హారతి మాత్రమే ఉంటుందని టీటీడీ స్పష్టం చేసింది. ఇతర హారతులు అనుమతించబడవని, భక్తులు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని సహకరించాలని కోరింది.

తిరుమల : శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. గురువారం ఉదయం కల్పవృక్ష వాహన సేవ నిర్వహించారు. రాత్రి సర్వభూపాల వాహనంపై దర్శనమిచ్చారు.







సర్వభూపాల వాహన సేవలో కళాకారుల నృత్యం





సీతా స్వయంవరం ఘట్టం ప్రదర్శిస్తున్న కళాకారులు



కల్పవృక్ష వాహన సేవలో కళాబృందాల ప్రదర్శన

అన్నదాతకు అండగా ఆర్‌బీకేలు



మాట్లాడుతున్న డీఏఓ ప్రసాద్‌రావు

తిరుపతి అర్బన్ : అన్నదాతలకు అండగా నిలిచేందుకే ప్రభుత్వం రైతుభరోసా కేంద్రాలను ప్రారంభించినట్లు జిల్లా వ్యవసాయశాఖాధికారి (డీఏఓ) ప్రసాద్‌రావు తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆర్‌బీకేలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను తెలుసుకోవచ్చని సూచించారు. ప్రస్తుతం ఎర్రావారిపాళెం, చిన్నగొట్టిగల్లు మండలాల్లో సబ్సిడీపై ఉలవలు పంపిణీ చేస్తున్నామని వెల్లడించారు. పీఎం కిసాన్ లబ్ధి పొందాలంటే ఈ నెలాఖరులోపు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని కోరారు. ఖరీఫ్‌కు సంబంధించి ఇప్పటికే విత్తనాలు, ఎరువులు పంపిణీ చేశామని, రబీ కోసం ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు వివరించారు. ఉద్యానశాఖ జిల్లా అధికారి దశరథరామిరెడ్డి మాట్లాడుతూ షెడ్ల నిర్మాణానికి సబ్సిడీపై నిధులందిస్తున్నట్లు వెల్లడించారు. శాస్త్రవేత్త కృష్ణారెడ్డి మాట్లాడుతూ కంది, మినుము,పెసర సాగుకు అక్టోబర్ అనుకూలమని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ విభాగం అధికారి జి.వాసు మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 29,468 ఎకరాల్లో సేంద్రియ సాగు చేపట్టినట్లు చెప్పారు. రాస్ కేవీకే శాస్త్రవేత్త సుధాకర్ మాట్లాడుతూ మేలు రకమైన మిరపనారు తమ వద్ద అందుబాటులో ఉందని వెల్లడించారు. మత్స్యశాఖ, బిందు సేద్యం, సెరి కల్చర్ అధికారులు శ్రీనివాస నాయక్, సతీష్, గీతారాణి పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రుల్లో మెరుగైన వైద్యం



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్ : ప్రభుత్వాస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందించాలని కలెక్టర్ వెంకటరమణారెడ్డి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. బడి బయట పిల్లలు బడిలో ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు.అంగన్‌వాడీ స్కూల్స్‌లో పౌష్టికాహారం క్రమం తప్పకుండా అందించాలని కోరారు. సమీక్షలో సీపీఓ ప్రేమచంద్రా రెడ్డి, డీఎల్‌పీఓ సుశీలాదేవి,ఐసీడీఎస్ పీడీ జయలక్ష్మి, హౌసింగ్ అధికారి వెంకటేశ్వర్లు, ఎస్సీ వెల్ఫేర్ ఆఫీసర్ చెన్నయ్య, డీఎంహెచ్‌ఓ శ్రీహరి, ఆరోగ్య శ్రీ జిల్లా మేనేజర్ శివకుమార్, డాక్టర్ శ్రీనివాస రావు, ఫ్యామిలీ డాక్టర్ కో-ఆర్డినేటర్ హనుమంతరావు పాల్గొన్నారు.

ప్రజల సహకారంతోనే రోడ్ల విస్తరణ



శిలాఫలకం ఆవిష్కరణలో టీటీడీ బోర్డు చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, మేయర్ శిరీష, కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ

తిరుపతి మంగళం : ప్రజల సహకారంతోనే తిరుపతిలో మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణం, రహదారుల విస్తరణ విజయవంతంగా పూర్తి చేయగలుతున్నామని టీటీడీ బోర్డు చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. గురువారం తాతయ్యగుంట వద్ద కొత్తగా వెడల్పు చేసిన రహదారులను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్టీసీ బస్టాండ్ వద్ద గాంధీ విగ్రహం నుంచి గంగమ్మగుడికి వచ్చే రహదారి ఇరుకుగా ఉండడంతో నగరవాసులు తీవ్రంగా ఇబ్బందిపడేవారన్నారు. ఇప్పుడు రోడ్డును వెడల్పు చేయడంతో స్థానికులకు ప్రయాణం సులభతరంగా మారిందని వెల్లడించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సైతం రెండు రోజుల కిందట ఈ రహదారి మీదుగానే గంగమ్మ దర్శనానికి వచ్చారని వివరించారు. త్వరలోనే మరిన్ని కొత్త రోడ్లు నిర్మించడమే కాకుండా, ఇరుకు దారులను వెడల్పు చేయించనున్నట్లు తెలిపారు. మేయర్ శిరీష, కమిషనర్ హరిత మాట్లాడుతూ రూ.3 కోట్ల వ్యయంతో గాంధీ విగ్రహం నుంచి గురవారెడ్డి ఇంటి సర్కిల్ వరకు 60 అడుగుల రోడ్డు, అక్కడి నుంచి గంగమ్మ గుడి వరకు 40 అడుగుల మేర రహదారిని విస్తరించినట్లు వెల్లడించారు. కొత్తగా బీటీ రోడ్డు నిర్మించి కాలువలు ఏర్పాటు చేశామని, లైటింగ్ సిస్టమ్‌ను ఆధునికీకరించామని వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, కార్పొరేటర్ దొడ్డారెడ్డి ప్రవళ్లికారెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, మున్సిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, డీఈ మహేష్, గంగమ్మ ఆలయ కమిటీ చైర్మన్ కట్టా గోపీయాదవ్, పార్టీ నాయకులు ఉదయ్ వంశీ, దొడ్డారెడ్డి శంకర్‌రెడ్డి, దొడ్డారెడ్డి మునిశేఖర్‌రెడ్డి, తొండమనాటి వెంకటేష్‌రెడ్డి, చింతా రమేష్ యాదవ్, చింతా భరణీ యాదవ్, బుల్లి, గీతా యాదవ్ పాల్గొన్నారు.

రాజమన్నార్ రాజసం

- తుమ్మలగుంటలో వైభవంగా బ్రహ్మోత్సవాలు
- కల్పవృక్ష, సర్వ భూపాల వాహనాలపై ఊరేగిన కల్యాణ వెంకన్న



సర్వభూపాలవాహనంపై దేవదేవేరులు



కల్పవృక్ష వాహన సేవలో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

తిరుపతి రూరల్ : తుమ్మలగుంటలోని కల్యాణ వెంకన్న ఆలయంలో వైభవంగా బ్రహ్మోత్సవాలు సాగుతున్నాయి. గురువారం ఉదయం రాజమన్నార్ అలంకారంలో శ్రీవారు కల్పవృక్ష వాహనంపై కొలువుదీరి భక్తులను కటాక్షించారు. మంగళ వాయిద్యాలు, భజనలు, కోలాటాలు, కళాకారుల ప్రదర్శనల నడుమ ఊరేగారు.

వేడుకగా స్నపన తిరుమంజనం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం మధ్యాహ్నం శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామికి వేడుకగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, చందనం, పసుపు, కొబ్బరి నీళ్లతో ఉత్సవర్లకు అభిషేకం చేశారు.కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, ఈఓ నల్లందుల సుబ్బరామిరెడ్డి పాల్గొన్నారు. రాత్రి శ్రీమలయప్పస్వామి వారు ఉభయ దేవేరులతో కలిసి సర్వభూపాల వాహనంపై దర్శనమిచ్చారు.

శ్రీవారికి సారె సమర్పణ

బ్రహ్మోత్సవాలలో భాగంగా తుమ్మలగుంట శ్రీ కళ్యాణ వేంకటేశ్వర స్వామివారికి తిరుపతి రూరల్ మండలం గాంధీపురం, అవిలాల, లింగేశ్వర నగర్, సాయినగర్, చిన్నగొట్టిగల్లు మండలం చిన్నగొట్టిగల్లు, చట్టేవారిపాళెం, భాకరాపేట పంచాయతీ వాసులు సారె సమర్పించారు. పట్టువస్త్రాలతో పాటు ఫలపుష్పాలను అందజేశారు. భక్తులకు ఆలయ ధర్మకర్త చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.



గరుడ సేవకు భారీ ఏర్పాట్లు



భద్రతా ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

తుమ్మలగుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం గరుడసేవ నిర్వహించనున్నారు. వేలాది మంది భక్తులు తరలి వచ్చే అవకాశం ఉండటంతో పోలీసులు పకడ్బందీ భద్రతా చర్యలు చేపట్టారు. ఈ మేరకు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డితో చంద్రగిరి డీఎస్పీ యశ్వంత్ గురువారం సాయంత్రం ఏర్పాట్లపై చర్చించారు. సుమారు 150 మంది పోలీసులు విధులు నిర్వహించేలా చర్యలు తీసుకున్నారు.

క్లుప్తంగా

శ్రీవారిమెట్టు వద్ద ప్రత్యేక ఏర్పాట్లు

చంద్రగిరి: తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శ్రీవారిమెట్టు వద్ద టీటీడీ విజిలెన్స్, చంద్రగిరి పోలీసు అధికారులు ప్రత్యేక ఏర్పాట్లను చేస్తున్నారు. తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో అత్యంత ప్రధానమైన గరుడ వాహనం. శుక్రవారం గరుడ వాహనం సందర్భంగా శ్రీవారిమెట్టు నుంచి భక్తులు పెద్ద ఎత్తున తిరుమలకు కాలినడకన వెళ్లనున్నారు. ఈ క్రమంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పోలీసు శాఖ నుంచి ఇప్పటికే అదనపు సిబ్బందితో శ్రీనివాసమంగాపురం, శ్రీవారిమెట్టు ప్రాంతాల్లో నియమించారు. శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పెద్ద ఎత్తున భక్తులు రానుండడంతో ప్రత్యేక కారు పార్కింగ్, ద్విచక్ర వాహనాల పార్కింగ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. దీంతో పాటు కాలినడకన తిరుమలకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం అల్పాహారాన్ని అందించేందుకు టీటీడీ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

15వేల మంది భక్తులు రాక

శ్రీవారి గరుడసేవ సందర్భంగా శుక్రవారం 15వేలకుపైగా భక్తులు శ్రీవారిమెట్టు మార్గం గుండా తిరుమలకు చేరుకోనున్నట్లు అధికారులు అంచనా వేశారు. చంద్రగిరి డీఎస్పీ డాక్టర్ యశ్వంత్ నేతృత్వంలో సీఐ రాజశేఖర్ ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా భద్రతను కట్టుదిట్టం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ద్విచక్ర వాహనాలకు సైతం ప్రత్యేక పార్కింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. గురువారం నుంచి శనివారం వరకు పోలీసులు విధులు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఎస్‌ఐలు హిమబిందు, రవీంద్రనాథ్ నాయక్ పాల్గొన్నారు.

వృద్ధుడి ఆత్మహత్య


మునస్వామి(ఫైల్)

నాగలాపురం : మండలంలోని కృష్ణాపురం హరిజనవాడకు చెందిన మునస్వామి (73) బుధవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తీవ్రమైన కడుపు నొప్పి రావడంతో తట్టుకోలేక వడిశాకు తినేశాడు. వెంటనే తిరుపతి రుయాకు తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ హనీఫ్ తెలిపారు.


గ్యాలరీలోకి వెళ్లేందుకు ఏర్పాటు చేసిన క్యూ


గోదాదేవి మాలలను ఊరేగింపుగా తీసుకువస్తున్న దృశ్యం

గరుడ గోవిందుని విహారానికి వేళాయె!

- తిరుమలలో గరుడ సేవకు విస్తృత ఏర్పాట్లు
- గ్యాలరీల్లో నిరంతరాయంగా అన్నప్రసాదాలు
- రీఫిల్లింగ్‌తో అధిక సంఖ్యలో భక్తులకు దర్శనం
- పకడ్బందీగా భద్రత

తిరుమల: శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం గరుడ సేవ నిర్వహించనున్నారు. ఈ క్రమంలో శ్రీవారి దర్శనార్థం పెద్దసంఖ్యలో తరలిరానున్న భక్తుల సౌకర్యార్థం టీటీడీ విస్తృతంగా ఏర్పాట్లు చేపట్టింది. దాదాపు 2 లక్షల మంది భక్తులు గ్యాలరీల్లో వేచి ఉండేలా సన్నద్ధం చేసింది. గరుడ సేవ దర్శనం కోసం ఇన్నర్ , ఔటర్ రింగ్ రోడ్లలో వేచి ఉండే భక్తులను సుపథం, సౌత్ వెస్ట్ కార్నర్, గోవిందనిలయం నార్త్ వెస్ట్ గేట్, నార్త్ ఈస్ట్ గేట్ల ద్వారా గ్యాలరీల్లోకి అనుమతించేలా ఏర్పాట్లు చేసింది. గరుడ వాహన సేవను రాత్రి 7 గంటలకు ప్రారంభించి భక్తులందరూ దర్శించుకునేలా రాత్రి 2 గంటల వరకు కొనసాగించేలా ప్రణాళిక రూపొందించింది. శ్రీవారి దర్శనార్థం భక్తులు తమ వంతు వచ్చే వరకు సంయమనంతో వేచి ఉండాలని సూచించింది.

అందుబాటులో అన్నప్రసాదం

మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనంలో ఉదయం 8 నుంచి రాత్రి ఒంటి గంట వరకు నిరంతరాయంగా అన్నప్రసాదాలు అందించేందుకు సన్నాహాలు పూర్తి చేసింది. గ్యాలరీల్లోనూ ఉదయం నుంచిరాత్రి వరకు పులిహోర, టమాట బాత్, బిసిబేళా బాత్ తదితర అన్నప్రసాదాల ప్యాకెట్లు పంపిణీ చేసేందుకు సన్నద్ధమైంది. అలాగే భక్తుల కోసం 2.50 లక్షల మజ్జిగ ప్యాకెట్లు సిద్ధం చేసింది. భక్తుల దాహార్తిని తీర్చేందుకు నాలుగు మాడ వీధుల్లోని గ్యాలరీల్లో 524 తాగునీటి డ్రమ్ములను ఏర్పాటు చేసింది.

పటిష్ట భద్రత

బ్రహ్మోత్సవాలకు దాదాపు 1,130 మంది టీటీడీ సిబ్బందితోపాటు 3,600 మంది పోలీసులతో పటిష్టంగా భద్రతా ఏర్పాట్లు చేశారు. గరుడసేవకు ప్రత్యేకంగా 1,200 మంది పోలీసులతో అదనపు భద్రత కల్పించారు. ఆలయ మాడ వీధులు, ఇతర ప్రాంతాల్లో 2,770 సీసీ కెమెరాల ద్వారా కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి పర్యవేక్షిస్తున్నారు. ఘాట్ రోడ్లలో భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకుని గురువారం సాయంత్రం 6 గంటల నుంచి శనివారం ఉదయం 6 గంటల వరకు ద్విచక్ర వాహనాల రాకపోకలను రద్దు చేశారు. తిరుపతిలోని అలిపిరి పాత చెక్ పాయింట్ వద్ద ద్విచక్ర వాహనాలను పార్క్ చేసుకునే సదుపాయం కల్పించారు. ఆర్టీసీ బస్సుల్లో దాదాపు 3 లక్షల మంది రాకపోకలు సాగించేలా చర్యలు చేపట్టారు. భక్తులకు వైద్యసేవలు అందించేందుకు మాడవీధుల్లో మొబైల్ క్లినిక్‌లు, 7 అంబులెన్సులు, డాక్టర్లు, పారామెడికల్ సిబ్బంది అందుబాటులో ఉంచారు. గరుడసేవ నాడు వాహనసేవను తిలకించేందుకు మాడ వీధులు, భక్తుల రద్దీ ఉన్న మ్యూజియం, వరాహస్వామి విశ్రాంతి గృహం, అన్నదానం కాంప్లెక్స్, రాంభగీచా విశ్రాంతి గృహం, ఫిల్టర్ హౌస్ తదితర ప్రాంతాల్లో 20 పెద్ద డిజిటల్ స్క్రీన్లు ఏర్పాటు చేశారు. అలాగే గరుడ సేవను వీక్షించిన భక్తులు వెంటనే గ్యాలరీల నుంచి వెళ్లిపోయేలా ప్రణాళిక రూపొందించారు. రీఫిల్లింగ్ చేయడం ద్వారా భక్తులందరూ గరుడోత్సవంలో పాల్గొనేలా ఏర్పాటు చేపట్టారు.


గరుడ సేవకు విచ్చేసే భక్తుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక క్యూ

శ్రీవిల్లిపుత్తూరు నుంచి విశేష మాలలు

గరుడసేవలో శ్రీవారికి అలంకరించేందుకు తమిళనాడులోని శ్రీవిల్లిపుత్తూరు నుంచి గోదాదేవిమాలలు గురువారం తిరుమలకు చేరుకున్నాయి. ముందుగా బేడి ఆంజనేయస్వామి ఆలయం వద్ద పెద్దజీయర్ మఠానికి మాలలను తీసుకొచ్చారు.పెద్దజీయర్‌స్వామి, తిరుమల చిన్నజీయర్‌స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం టీటీడీ ఈఓ ఏవీ ధర్మారెడ్డి, తమిళనాడు దేవదాయ శాఖ జాయింట్ కమిషనర్ సెల్లదొరై, శ్రీవిల్లిపుత్తూరు ఆలయ ఈఓ ముత్తురాజ, ట్రస్టుబోర్డు సభ్యుడు మనోహరన్ ఆధ్వర్యంలో ఊరేగించి శ్రీవారి ఆలయంలోకి తీసుకెళ్లారు. ఈఓ ధర్మారెడ్డి మాట్లాడుతూ గోదాదేవికి అలంకరించిన మాలలను గరుడసేవ రోజు శ్రీవారికి అలంకరించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఢిల్లీ స్థానిక సలహా మండలి అధ్యక్షులు వేమిరెడ్డి ప్రశాంతి, డిప్యూటీ ఈఓ లోకనాథం, శ్రీవిల్లిపుత్తూరు ఆలయ స్థానాచార్యులు రంగరాజన్, సుదర్శన్ పాల్గొన్నారు.

చెన్నై నుంచి గొడుగులు

గరుడసేవ రోజున శ్రీవారికి అలంకరించేందుకు హిందూ ధర్మార్థ సమితి వారు చెన్నై నుంచి తొమ్మిది గొడుగులను ఊరేగింపుగా గురువారం తీసుకువచ్చారు. సమితి ట్రస్టీ ఆర్ ఆర్ గోపాల్‌జీ ఆధ్వర్యంలో తిరుమలకు చేరుకున్న గొడుగులకు టీటీడీ అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. ఆలయం ముందు గొడుగులను టీటీడీ ఈఓ ఏవీ ధర్మారెడ్డికి అందించారు. మాడ వీధుల్లో ఊరేగించిన అనంతరం ఆలయంలోకి తీసుకెళ్లారు. గోపాల్‌జీ మాట్లాడుతూ ఈనెల 16న చెన్నై నుంచి 11 గొడుగుల ఊరేగింపు ప్రారంభమైందన్నారు. చెన్నైలోని చెన్నకేశవ పెరుమాళ్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించామన్నారు. బుధవారం రాత్రి తిరుచానూరు పద్మావతి అమ్మవారికి 2 గొడుగులను సమర్పించినట్లు చెప్పారు. సుమారు 19 ఏళ్లగా తిరుమల శ్రీవారికి గరుడ సేవలో అలంకరణ నిమిత్తం గొడుగులు అందజేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ లోకనాథం పాల్గొన్నారు.

రైతులతో అమెరికా అధికారి ముఖాముఖి

- వ్యవసాయ ఆదాయంపై ఆరా
- వీసా ఇంటర్వ్యూలపై అవగాహన


రైతులతో యూఎస్‌ఏ స్టేట్ కౌన్సిల్ అధికారి మెరీనా

రామచంద్రాపురం: విదేశీ ప్రయాణానికి అవసరమగు వీసా ఇంటర్వ్యూలో వ్యవసాయం దాని అనుబంధ ఆదాయం ప్రముఖ పాత్ర పోషిస్తోందని యూఎస్‌ఏ స్టేట్ కౌన్సిల్ అధికారి మెరీనా అన్నారు. గురువారం మండలంలోని సీ.రామాపురం సమీపంలోని రైతు భరోసా కేంద్రంలో రైతులతో ముఖాముఖి నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, తిరుపతి పరిసర ప్రాంతాల నుంచి పలువురు విద్యార్థులు ఉన్నత చదువుల కోసం అమెరికాకు వెళ్లే సమయంలో ఎక్కువ మంది వ్యవసాయ ఆదాయాన్ని వీసా ఇంటర్వ్యూలో చూపుతుండడంతో అమెరికా కౌన్సిల్ అధికారుల ఆదేశాలతో ఇక్కడ రైతులతో సమావేశమైనట్టు ఆమె చెప్పారు. రైతులకు వ్యవసాయపరంగా ఎంత ఆదాయం వస్తుందో అడిగి తెలుసుకున్నారు. తమ పిల్లల విదేశీ ప్రయాణానికి వ్యవసాయ, ఉద్యానవన పంటల ఆదాయాలు ఉపయోగపడుతున్నట్లు రైతులు ఆమెకు వివరించారు. అనంతరం ఏఓ శ్రవంతి రైతు భరోసా కేంద్రాల సేవలను ఆమెకు తెలియజేశారు. కార్యక్రమంలో హైదారాబాద్‌లోని యూఎస్‌ఏ కాన్సులేట్ జనరల్ వసుంధర, వ్యవసాయ సహాయ సంచాలకులు ధనంజయరెడ్డి, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు మూడంచెల భద్రత


మాట్లాడుతున్న టీటీడీ ఈఓ ధర్మారెడ్డి, పక్కన డీఐజీలు అమ్మిరెడ్డి, గోపీనాథ్ జెట్టి తదితరులు

చంద్రగిరి : తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు మూడంచెల భద్రత కల్పించినట్లు టీటీడీ ఈఓ ఏవీ ధర్మారెడ్డి తెలిపారు. గురువారం ఆయన గరుడ సేవ బందోబస్తుపై డీఐజీలు అమ్మిరెడ్డి, గోపీనాథ్ జెట్టి, ఎస్పీ పరమేశ్వర్ రెడ్డితో కలసి సమావేశం నిర్వహించారు. ఈఓ మాట్లాడుతూ శ్రీవారి భక్తులతో మర్యాదపూర్వంకగా నడుచుకోవాలని సూచించారు. భక్తులకు సేవ చేస్తే శ్రీవారి కటాక్షం లభిస్తుందని వెల్లడించారు. డీఐజీ అమ్మిరెడ్డి మాట్లాడుతూ గరుడ వాహన సేవను తిలకించేందుకు లక్షలాది మంది వచ్చే అవకాశం ఉందన్నారు. తిరుమల మొత్తం పోలీసుల ఆధీనంలో ఉంటుందని, తమ సిబ్బంది కమాండ్ కంట్రోల్ రూమ్ పర్యవేక్షిస్తూ ఎప్పటికప్పుడు సిబ్బందిని అప్రమత్తం చేస్తారని వివరించారు. ప్రస్తుతం మొదటి విడతలో 4 వేల మంది పోలీసులు బందోబస్తు విధులు నిర్వర్తిస్తున్నారని చెప్పారు. గరుడసేవ కోసం అదనంగా వెయ్యి మందిని నియమిస్తున్నట్లు వెల్లడించారు. ఘాట్ రోడ్లలో ట్రాఫిక్ జామ్ కాకుండా పటిష్టమైన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. తిరుమలలో 15 వేల వాహనాలను పార్కింగ్‌కు అవకాశముందని, అందుకు తగ్గట్టు పాసులు జారీ చేస్తున్నామని వివరించారు. డీఐజీ గోపీనాథ్ జెట్టి మాట్లాడుతూ గ్యాలరీల్లోకి వెళ్లలేని భక్తుల కోసం గత ఏడాది బ్రహ్మోత్సవాలలో చేపట్టిన గరుడోత్సవ దర్శనం ప్రణాళిక విజయవంతమైందన్నారు. ఈ ఏడాది కూడా అదే పద్ధతి అమలు చేయనున్నట్లు వెల్లడించారు. అందులో భాగంగా ఇన్నర్ రింగ్ రోడ్డులో 5 ప్రత్యేక క్యూలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జేఈఓ వీరబ్రహ్మం, సీవీఎస్‌ఓ నరసింహ కిషోర్, చిత్తూరు ఎస్పీ రిషాంత్ రెడ్డి, అడిషనల్ ఎస్పీ మునిరామయ్య పాల్గొన్నారు.

చిరుధాన్యాలు ఆరోగ్యానికి దివ్యౌషధం

- ఎస్వీయూ వీసీ రాజారెడ్డి


సదస్సులో మాట్లాడుతున్న వీసీ రాజారెడ్డి

తిరుపతి సిటీ: చిరుధాన్యాలతో తయారుచేసిన ఆహార పదార్థాలు తీసుకోవడమే శ్రేష్ఠమైన ఆరోగ్యానికి సోపానమని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.రాజారెడ్డి అన్నారు. ఫుడ్ టెక్నాలజీ-ఫుడ్ సైన్స్ న్యూట్రిషన్ విభాగం, కౌన్సిల్ ఫర్ ప్రమోషన్ రీసెర్చ్ అండ్ ట్రేడ్ ఇన్ ట్రెడిషనల్ ఫుడ్స్(న్యూఢిల్లీ) గురువారం ఎస్వీయూ సెనేట్ హాల్లో ‘మిల్లెట్స్ ద సూపర్ ఫుడ్ ఫర్ సస్టైనబుల్ హెల్త్-వెల్నెస్’ అనే అంశంపై సంయుక్తంగా జాతీయ సదస్సు నిర్వహించాయి. ఎస్వీయూ ఉపకులపతి మాట్లాడుతూ, ఇండియా చిరుధాన్యాల ఉత్పత్తి, ఎగుమతుల విషయంలో మంచి ప్రగతి సాధించిందని, కోవిడ్ సమయంలో చిరుధాన్యాలు ఎంతో మందికి ఆరోగ్యాన్నిచ్చాయన్నారు. అనంతరం సదస్సు వద్ద చిరుధాన్యాల ఆహార ప్రదర్శనశాలను ఆయన ప్రారంభించారు. సదస్సులో డాక్టర్ హేమంత్ కుమార్ (వ్యవసాయ విశ్వవిద్యాలయం), డాక్టర్ తారా సత్యవతి (ఐకార్) తదితరులు వివిధ అంశాలపై ప్రసంగించారు. హోమ్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ కె. మంజుల సదస్సుకు కన్వీనర్‌గా వ్యవహరించారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ కె.తులసి రామకృష్ణారెడ్డి, హోమ్ సైన్స్ విభాగానికి చెందిన డాక్టర్ కేవీ.సుచరిత, డాక్టర్ కే.అనురాధ, డాక్టర్ బి.స్వరూపరాణి, డాక్టర్ అనిత, డాక్టర్ నీరజ, డాక్టర్ సింధుజ, పరిశోధకులు, విద్యార్థినీవిద్యార్థులు పాల్గొన్నారు.

బైక్‌ల దొంగ అరెస్ట్


నిందితుడి అరెస్ట్ చూపుతున్న డీఎస్పీ సురేంద్ర రెడ్డి

చంద్రగిరి : ద్విచక్రవాహనాలను చోరీ చేస్తున్న నిందితుడిని అలిపిరి పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. డీఎస్పీ సురేంద్రరెడ్డి కథనం మేరకు.. అన్నమయ్య జిల్లా పీలేరు మండలం, బసిరెడ్డిగారిపల్లెకు చెందిన వేణుగోపాల్ నాయక్, కుప్పం శ్రీరామ్ ఫైనాన్స్‌లో ఏజెంట్‌గా పని చేసేవాడు. జల్సాలకు అలవాటు పడి బైక్ చోరీకి దిగాడు. ఫైనాన్స్ కంపెనీలో రికవరీ చేసిన వాహనాలని నమ్మిస్తూ తక్కువ ధరకే విక్రయించేవాడు. ఈ క్రమంలో నిందితుడు తిరుపతి, చంద్రగిరిలో సుమారు రూ.20లక్షల విలువైన 34 ద్విచక్రవాహనాలు అపహరించినట్లు పోలీసులు గుర్తించారు. ఈ మేరకు ఆయా వాహనాలను స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు. మీడియా సమావేశంలో సీఐ అబ్బన్న, ఎస్‌ఐ రాజశేఖర్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


ఘటనాస్థలంలో రవికుమార్ మృతదేహం

ఏర్పేడు : మండలంలోని మేర్లపాక సమీపంలో పుష్పిత్ కర్మాగారం వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. సీఐ శ్రీహరి కథనం మేరకు.. మేర్లపాక ఎస్సీ కాలనీకి చెందిన రవికుమార్(45) పుష్పిత్ కర్మాగారంలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. విధులకు హాజరయ్యేందుకు ఇంటి నుంచి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా వెనుక నుంచి లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మరణించాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.